సాక్షి విజయనగరం

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025

గేట్‌లో పిరిడి విద్యార్థిని ప్రతిభ



బొబ్బిలిరూరల్: పిరిడి గ్రామానికి చెందిన బొబ్బినాయని యశశ్విని ఇటీవల విడుదలైన ఆలిండియా గేట్ పరీక్ష ఫలితాల్లో 8వ ర్యాంకు సాధించింది. ఏయూలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన యశశ్విని ఎంటెక్ డెహ్రాడూన్‌లో చదువుతోంది. తండ్రి బొమ్మినాయని ధనుంజయ పంచాయతీ రాజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.



కవరులో మామిడి.. నాణ్యమైన దిగుబడి

- 8లో

మామిడి పండుకు కవరే రక్షణ అని, చిన్నచిన్న మెలకువలతో నాణ్యమైన దిగుబడులు సాధించాలని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు.



న్యాయం చేయాలి..

ఓ భూ వివాదంపై వల్లంపూడి ఎస్సై ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

పైడితల్లిని దర్శించుకున్న గానకోకిల



పైడితల్లికి పూజచేస్తున్న గానకోకిల సుశీల

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని గానకోకిల, పద్మశ్రీ పి.సుశీల సోమవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద పండితులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం ఆలయ ఇన్‌చార్జి ఈఓ కేఎన్‌వీడీవీ.ప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు ఆమెకు వేదాశీస్సులు, అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. విజయనగరంలోని గురునారాయణ కళాపీఠం వార్షికోత్సవ వేడుకలకు ఆమె హాజరయ్యారు. మంత్రి శ్రీనివాస్, నిర్వాహకుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

రామతీర్థంలో వసంతోత్సవాలు



స్వామివారి సన్నిధిలో పారాయణం చేస్తున్న వేదపండితులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఈ నెల 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని కల్యాణ వసంతోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత మంగళాశాసనం, తీర్థ గోష్ఠి జరిపించారు. అనంతరం స్వామి సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 40 మంది వేద పండితులు శ్రీమద్రామాయణ, సుందరాకాండ పారాయణాలు, దివ్య ప్రబంధ సేవాకాలం, లక్ష తులసీ దళార్చన, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. యాగశాలలో గాయత్రీ రామాయణం, సంక్షేప రామాయణం, సుందరాకాండ హవనం జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్‌పై భద్రాచలానికి..



రామతీర్థంలో సైకిల్ యాత్రికుడు ప్రకాశరావు

నెల్లిమర్ల రూరల్: రాముడిపై తనకు ఉన్న అమితమైన విశ్వాసంతో ఓ భక్తుడు మండుటెండను సైతం లెక్క చేయకుండా భద్రాచలానికి సైకిల్‌పై పయనమయ్యాడు. తాను రాసిన రామ కోటిని భద్రాచలంలో స్వామికి సమర్పించేందుకు సెగలుకక్కుతున్న ఎండను సైతం లెక్క చేయలేదు. వయసు మీద పడినప్పటికీ అపారమైన భక్తి భావంతో రామ నామాన్ని జపిస్తూ శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం కొత్తరకొండ గ్రామానికి చెందిన లంక ప్రకాశరావు సోమవారం రామతీర్థానికి చేరుకున్నాడు. గడిచిన 20 ఏళ్ల నుంచి సైకిల్‌పై భద్రాచలం రామయ్య సన్నిధికి వెళ్తున్నట్టు తెలిపారు. రెండు రోజుల కిందట పయనమై మార్గం మధ్యలో ఉన్న అరసవిల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించి.. సుమారు 200 కిలో మీటర్లు ప్రయాణం సాగించి రామతీర్థం చేరుకున్నట్టు చెప్పారు. రాత్రికి రామతీర్థంలో బస చేసి మంగళవారం ఉదయం బయలుదేరుతానని తెలిపారు. సింహాచలం, అన్నవరం, ద్వారపూడి మీదుగా సుమారు 429 కిలోమీటర్లు దూరంలో ఉన్న భద్రాచలానికి చేరుకుంటానన్నారు.





తండ్రీ.. ఉజ్వల భవితకు మార్గం చూపు..



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్ వద్ద ఉన్న మసీద్‌లో నమాజ్, ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

భక్తిశ్రద్ధలతో రంజాన్

విజయనగరం టౌన్:

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 8 గంటలకు ఈద్గాలకు చేరుకుని నమాజ్ చేశారు. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న ఈద్గాలో సుమారు ఐదు వేల మంది ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు చేశారు. మతపెద్దలు రంజాన్ సందేశాన్ని వినిపించారు. నెలరోజుల పాటు చేసిన కఠిన ఉపవాస దీక్షల విశేషాన్ని వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నిరుపేదలకు దానధర్మాలు చేశారు. పట్టణంలోని జామియా మసీదు, చోటీ మసీద్, కంటోన్మెంట్ మసీదు, ఆబాద్ వీధి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) వేడుకలలో పాల్గొని, ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

■ నల్ల చట్టాలకు ఆమోదం తెలపడం బాధాకరం



వక్ఫ్ అమెండ్‌మెంట్ చట్టానికి టీడీపీ ఆమోదం తెలపడంపై ఎంపీని ప్రశ్నిస్తున్న ముస్లింలు

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న ఈద్గాలో ముస్లిం సోదరులు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. వక్ఫ్ అమెండ్‌మెంట్ వంటి నల్ల చట్టాలకు టీడీపీ ఆమోదం తెలపడంపై ముస్లింలు ప్రశ్నించారు. ముస్లింను కేవలం ఓట్లకోసమే వినియోగించుకుంటారా? కష్టాల్లో సహాయంగా నిలబడరా అని ప్రశ్నించారు. ముస్లింలకు వ్యతిరేకంగా బీజేపీ చట్టాలు చేస్తుంటే కూటమి ప్రభుత్వం మద్దతు తెలపడం ఎంతవరకూ సమంజసమన్నారు. రంజాన్‌లో తమకు కావాల్సింది శుభాకాంక్షలు, ఇఫ్తార్ విందులు కాదని, బిల్లుపై వ్యతిరేకత చూపిస్తే అదే ఒక బహుమానమని పేర్కొన్నారు.

వేసవిని ఎదుర్కోవడానికి సిద్ధం



- మే నెలాఖరు వరకూ తాగునీటికి ఢోకా లేదు
- జలాశయాలు, భూగర్భ జలాలు ఆశాజనకం
- తోటపల్లి, తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టులపై దృష్టి
- చురుగ్గా భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు
- కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి జూలైకల్లా సొంత క్యాంపస్
- 'రెల్లి' భూముల్లో కేంద్ర గ్రేహౌండ్స్ శిక్షణ సంస్థ
- సాక్షి ఇంటర్వ్యూలో విజయనగరం కలెక్టరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

జిల్లాలో మార్చి నెల నుంచి సూరీడు మండిపోతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటిపోతున్నాయి. రానున్న 'వేసవి' కాలాన్ని ఎదుర్కోవడానికి అన్నివిధాలా సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా ప్రజలకు అభయమిచ్చారు. తాగునీటి సరఫరా ప్రణాళికతో పాటు జిల్లాలో అభివృద్ధి పనుల పురోగతిని 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

సాక్షి: 'వేసవి' సమస్యలపై ప్రణాళిక ఏమిటి?

కలెక్టర్: జిల్లాలోని బోర్లన్నీ ఇప్పటికే శుభ్రం చేయించాం. తాగునీటి సరఫరా విషయానికొస్తే విజయనగరం నగరపాలక సంస్థ, బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో రెండ్రోజులకోసారి, రాజాం మున్సిపాలిటీ, నెల్లిమర్ల నగర పంచాయతీల్లో ప్రతిరోజూ ఇస్తున్నాం. ప్రస్తుతానికి తాగునీటికి కొరతలేదు. భూగర్భ జలాలు, జలాశయాల్లో నీటిమట్టం ఆశాజనకంగానే ఉన్నాయి. మే నెలాఖరు వరకూ ఢోకా ఉండదని అంచనా వేస్తున్నాం. మండల స్థాయిలో అధికారులతో సమీక్షిస్తున్నాం. ఎక్కడైనా సమస్య ఎదురైతే ట్యాంకర్లతో సరఫరా చేయాలని ఆదేశాలిచ్చాం.

సాక్షి: విజయనగరం జిల్లా కేంద్రానికి పుష్కలంగా తాగునీరు అందించడానికి ఉద్దేశించిన తారకరామ తీర్థ సాగరం ప్రాజెక్టు పరిస్థితి ఏమిటి?

కలెక్టరు: విజయనగరానికే కాదు త్వరలో ప్రారంభంకానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన నీటిని తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టు నుంచే సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటికే 44 శాతం పనులు పూర్తయ్యాయి. మిగులు పనులు పూర్తి చేయడానికి తాజా అంచనా ప్రకారం రూ.807.55 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించాం. ఇది పూర్తయితే 16,538 ఎకరాల భూమికి సాగునీరు కూడా అందుతుంది.

సాక్షి: తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ పనుల మాటేమిటి?

కలెక్టరు: జిల్లాలో అదనంగా 23,119 ఎకరాలకు సాగునీటిని అందించే ఉద్దేశంతో తలపెట్టిన తోటపల్లి కుడి ప్రధాన కాలువ పనులు 86 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.105.63 కోట్లు మేర నిధులు అవసరమవుతాయి.

సాక్షి: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తవుతాయా?

కలెక్టరు: గత ఏడాది జూలై నాటికి 31.80 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం 67.92 శాతానికి చేరాయి. భూమి చదును పనులైతే గత జూలై నాటికే 97 శాతం అయిపోయాయి. దీంతో మిగతా పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయి. రన్‌వే నిర్మాణ పనులు 96 శాతం, టాక్సీ వే పనులు 84.45 శాతం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) నిర్మాణ పనులు 64.22 శాతం పూర్తయ్యాయి. 2026 డిసెంబర్ 13 నాటికి తొలి దశ పూర్తి చేసి కమర్షియల్ ఆపరేషన్స్ ప్రారంభించాలన్న నిర్దేశిత గడువులోగానే సిద్ధం చేస్తామని జీఎంఆర్ ఏరో ప్రతినిధులు చెబుతున్నారు.

సాక్షి: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి సొంత క్యాంపస్ పనుల పురోగతి ఎంతవరకూ వచ్చింది?

కలెక్టరు: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరానికి సొంత క్యాంపస్ అందుబాటులోకి వస్తుంది. సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలంలో భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. జాతీయ రహదారి నుంచి క్యాంపస్ వరకూ అప్రోచ్ రోడ్డుకు కొంతమేర భూసేకరణకు, తాగునీటి సరఫరా మిగులు పనులు, విద్యుద్దీకరణకు రూ.29.15 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదించాం. ఇవన్నీ పూర్తయితే 561 ఎకరాల్లోనున్న సువిశాల, ఆహ్లాదకరమైన వాతావరణంలోని సొంత క్యాంపస్‌కు జూలైనాటికల్లా వెళ్లిపోవచ్చు. గతంలో కొత్తవలస మండలంలో రెల్లి వద్ద కేటాయించిన 526 ఎకరాలను కేంద్ర గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకోసం కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాం.

సాక్షి: ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా గతంలో జిల్లా అధికారులు రెల్లి వద్ద ప్రతిపాదించిన ఇండస్ట్రియల్ పార్కు పరిస్థితి ఏమిటి?

కలెక్టరు: ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేసేందుకు ఏపీఐఐసీ ప్రణాళిక ఉంది. ఇందుకోసం చీపురుపల్లి నియోజకవర్గంలో పది ఎకరాలు, గజపతినగరంలో 57.49 ఎకరాలు, విజయనగరంలో 12, రాజాంలో 20, బొబ్బిలిలో వంద, ఎస్.కోటలో 57, నెల్లిమర్లలో 19 ఎకరాలు స్వాధీనం చేశాం.

సాక్షి: వైద్య వసతుల కల్పన మాటేమిటి?

కలెక్టరు: విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ రెండో దశ పనులు జరుగుతున్నాయి. కిడ్నీ రోగుల కోసం మరో ఐదు డయాలసిస్ యూనిట్లు పెట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ఇందుకు రూ.కోటి వరకూ అవసరం. వీటి నిర్వహణకు ప్రతి నెలా రూ.4 లక్షల వరకూ ఖర్చు అవుతుంది.

కొండెక్కిన కోడి



- భారీగా పెరిగిన చికెన్ ధర
- ఎండల తీవ్రత వల్ల తగ్గిన కోళ్ల ఉత్పత్తి
- మాంసం ప్రియులకు ధరాభారం

విజయనగరం గంటస్తంభం: ఉగాది, రంజాన్ పండగ నేపథ్యంలో చికెన్ ధరలు భారీగా పెరిగాయి. విజయనగరం పట్టణంలో కిలో రూ.230 నుంచి రూ.280 వరకు విక్రయించారు. కొన్నిచోట్ల డిమాండ్ బట్టి ఇంతకంటే ఎక్కువ ధరకు విక్రయాలు జరిపారు. బర్డ్ ఫ్లూ భయంతో గతవారం వరకు చికెన్ అమ్మకాలు పడిపోగా ధరలు తగ్గాయి. మళ్లీ ఉగాది నుంచి కేజీపై రూ.30 నుంచి రూ.50 పెరిగాయి. విజయనగరం జిల్లాలో సుమారు 260 కోళ్ల ఫారాలు ఉన్నాయి. జిల్లాలో సాధారణ రోజుల్లో ప్రతి రోజు 1.18 లక్షల కోళ్లు అమ్మకాలు జరుగుతాయని వ్యాపార వర్గాల అంచనా. అదే ఆదివారం, మంగళవారం, ఇతర పండగ రోజుల్లో రూ.1.75 లక్షల వరకు అమ్ముడవుతాయని చికెన్ వ్యాపారులు చెబుతున్నారు.

● ఎండ ఎఫెక్ట్..

ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరగడం కూడా చికెన్ ధర పెరుగుదలకు కారణమని, ఎండ ప్రభావంతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయని పౌల్ట్రీ నిర్వాహకులు చెబుతున్నారు. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో కోడిపిల్ల కిలోన్నర బరువు పెరగడానికి సుమారు 40 రోజులు పడుతుందని, మార్చి నెల నుంచే ఎండలు మండిపోతుండడంతో పిల్ల దశ నుంచి కోడి దశకు ఎదగడానికి 50 నుంచి 60 రోజులు పడుతోందన్నారు. కోళ్ల ఫారాలలో కూలర్లు, ఏసీలు పెడితేగానీ కోడి పిల్లలు బతికే పరిస్థితి లేదంటున్నారు. విజయనగరం జిల్లాలో ఫిబ్రవరి నుంచి కోళ్ల ఉత్పత్తి క్రమంగా తగ్గుతూ వస్తోందని, ధరలు పెరగడానికి ఇది కూడా ఓ కారణమని పేర్కొంటున్నారు.



కోళ్లఫారం

ఫ్యాప్టో ఆందోళన రేపు



ఐక్యనినాదంలో ఫ్యాప్టో జిల్లా కమిటీ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం ఈ నెల 2న కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని విజయవతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. స్థానిక దాసన్నపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఫ్యాప్టో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తక్షణమే 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ కమిటీ నియమించాలని, పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ ఎరియర్స్‌ను, సరెండర్ లీవు బకాయిలు చెల్లించాలని కోరారు. దీనికోసం పోరుబాట సాగిద్దామన్నారు. అనంతరం ఐక్య నినాదం వినిపించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కె.జోగారావు, సూరిబాబు, పి.దామోదరనాయుడు, జేఆర్ కేవీఈశ్వరరావు, భాస్కరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● నమ్మండి.. ఇదే మా పాఠశాల..!



ఈ పూరిపాకే మా పాఠశాల. ఎండకాస్తే మాడిపోవాలి. వానొస్తే తడిచిపోవాలి. ఎన్నోసార్లు పాఠశాలకు భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నా పట్టించుకోవడం లేదు. పశు గోశాలలు నిర్మించడంపై చూపుతున్న శ్రద్ధ మా పాఠశాలపై లేదంటూ బొబ్బిలి మండలం గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని బట్టివలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. 'బాబూ'.. 'నాయినా'.. మీకు దండం పెడతాం.. మాకు పాఠశాల భవనం మంజూరు చేయండంటూ సోమవారం విజ్ఞప్తిచేశారు. గ్రామానికి చెందిన 8 మంది చిన్నారులు పాఠశాలలో 1, 2 తరగతులు చదువుతుండగా, మరో ఏడుగురు విద్యార్థులు 3వ తరగతి చదువుకోసం మూడు కిలోమీటర్ల దూరంలోని గోపాలరాయుడుపేట పాఠశాలకు వెళ్తున్నారు. ఇదే విషయంపై ఎంఈఓ చల్లా లక్ష్మణరావు స్పందిస్తూ పలు మార్లు పాఠశాల భవనం నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపించామని, నిధులు మంజూరు కాలేదన్నారు. మరో మారు ప్రయత్నిస్తానని చెప్పారు.

- బొబ్బిలిరూరల్

నేటి నుంచి ఇంటర్మీడియట్ తరగతులు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర తరగతులను మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్టు ఇంటర్మీడియట్ ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 72 ప్రభుత్వ, 107 ప్రైవేటు జనరల్ ఇంటర్మీడియట్, వృత్తి విద్యాకోర్సుల కళాశాలల్లోని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర బోధన సిలబస్ ప్రారంభించాలని ఆయా ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు పంపామన్నారు.

■ టీడీపీలో 'చెత్త' చేరికలు!

- చెత్త సమస్య చెబుతామని తీసుకెళ్లి మెడలో పసుపు కండువాలు

సార్వత్రిక ఎన్నికల్లో విజయం బలుపు కాదు వాపు అని టీడీపీ నాయకులకు తెలిసిపోయినట్లుంది. సూపర్ సిక్స్ హామీలే కాదు ఎన్నికల్లో గట్టెక్కడానికి ఊదరగొట్టిన ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడం సంగతి అటుంచి ఇప్పుడు రకరకాల పన్నుల పేరుతో 'బాదుడే బాదుడు' అంటే ఏమిటో ప్రజలను చావుదెబ్బ కొడుతున్నారు. ఇంత బాదుతున్నా ఇంకా ప్రజలు తమవైపే ఉన్నారని చూపించుకోవడానికి నానా అగచాట్లు పడుతున్నారు. అబ్బో... తమ పాలన చూసి టీడీపీలోకి గేట్లు తన్నుకొనిమరీ వచ్చేస్తున్నారని చూపించడానికి కొత్తతరహా చేరికల సినిమాకు తెరలేపారు. ఇందులో భాగంగానే విజయనగరం జిల్లా కేంద్రంలో మెప్మా అధికారులను, డ్వాక్రా సంఘాలను పావులుగా వాడుతున్నారు. 'చెత్త' సమస్యను చెబుదామని సోమవారం 34వ డివిజన్‌కు చెందిన మహిళలను ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు వద్దకు తీసుకెళ్లి పసుపు కండువా మెడలో వేయించారు. 200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరిపోయాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం మోత మోగించారు. ఎందుకు తీసుకొచ్చారు? ఏమి చేస్తున్నారు? అని అసలు విషయం అర్థమయ్యేసరికి ప్రదీప్‌నగర్ మహిళల ముఖాలు చిన్నబోయాయి. ఒకరి ముఖంలోనూ చిరునవ్వు లేదు. అశోక్ బంగళాలో టీడీపీ నాయకుల ప్రసంగాలు, ఫొటో సెషన్ అయ్యేవరకూ బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. ఇదండీ టీడీపీలో చేరికల సంగతి.

- సాక్షి ప్రతినిధి, విజయనగరం



క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు


తిరుపతిరావు (ఫైల్)

వీరఘట్టం/పాలకొండ రూరల్: మండలంలోని తూడి జంక్షన్ వద్ద సీఎస్పీ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మీసాల తిరుపతిరావు (39) అనే వ్యక్తి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై జి.కళాధర్ సోమవారం తెలిపారు. మృతుని భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. బైక్‌పై వస్తున్న తిరుపతిరావును వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. తిరుపతిరావు మృతితో పాలకొండ మండలం పొట్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్యతో పాటు హర్షవర్ధన్, సుధీర్ అనే ఇద్దరు కుమారులున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు..?


కారులో ఉన్న గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఫిబ్రవరి 10వ తేదీన ఒడిశా నుంచి తరలిస్తున్న 150 కిలోల గంజాయి పోలీసులకు పట్టుబడగా.. కారు వదిలేసి అందులో ఉన్న నిందితులు పరారైన సంగతి తెలిసిందే. వెంటనే ఈ వ్యవహారంపై సీఐ నారాయణరావు, ఎస్సై వి. ప్రసాదారావు కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు చేపట్టడంతో నలుగురు నిందితులు దొరికి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అదుపులో ఉన్న నలుగురు నిందితుల్లో ఒకరు అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు గ్రామానికి చెందిన వాడు కాగా.. ఇద్దరు విశాఖ జిల్లా అనందరంపురానికి చెందిన వారని తెలిసింది. అలాగే ఇంకొకరు విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన వ్యక్తి అని సమాచారం. వీరు ఈ గంజాయిని ఎక్కడి నుంచి తెస్తున్నారు..? ఎక్కడికి తీసుకెళుతున్నారు..? అక్రమ రవాణా వెనుక ఎవరున్నారు..? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. నిందితులను ఎస్పీ ఎదుట మంగళవారం హాజరుపరచనున్నట్లు సమాచారం.

జోరుగా గ్రావెల్ తవ్వకాలు


జేసీబీ సహాయంతో గ్రావెల్ తవ్వకాలు

భామిని: మండలంలోని బురుజోల – పసుకుడి మెట్ట వద్ద గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మూడు రోజులుగా తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏకంగా జేసీబీలతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల సహాయంతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తవ్వకాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ట్రాక్‌పై మృతదేహం



రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న మృతదేహం (ఇన్‌సెట్లో)అరుణ బలేరా (ఫైల్)

సీతానగరం: మండలంలోని సీతానగరం – గుమ్మిడివరం గ్రామాల మధ్య గల రైల్వే ట్రాక్‌పై ఓ వ్యక్తి మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న రైల్వే హెచ్‌సీ బి. ఈశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైలు నుంచి జారిపడి మృతి చెందాడా.. లేక రైలు ఢీ కొనడం వల్ల ప్రమాదం జరిగిందా అన్న విషయమై పోలీసులు విచారణ చేపడుతున్నారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలను బట్టి అతను ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన అరుణ బలేరా (40) సన్నాఫ్ మోహన్ బలేరాగా గుర్తించారు.

Roc. No.15/2021/E1 Dt.29.03.2025

BOBBILI MUNICIPALITY
e.PROCUREMENT TENDER NOTICE

Sl No	Nit No	No.of Works	Estimated cost
1	13/2024-25/DyEE/1-20, dt.29.03.2025	20	Rs.76.07 lakhs

Bid Document Downloading Start Date	01.04.2025 at 11.00 AM
Bid Document Downloading End Date	08.04.2025 at 11.00 AM
Last Date & Time for receipt of Bids	08.04.2025 at 3.00 PM
Technical Bid opening Date	08.04.2025 at 4.00 PM

Note: Other Details please read e.procurement market plan
https://tender.apeprocurement.gov.in
Sd/- Commissioner., Bobbili Municipality

- మామిడి కాయలకు కవర్లతో రక్షణ
- తెగుళ్లు, మచ్చలకు చెక్
- జిల్లాలో 30 వేల హెక్టార్లలో మామిడి సాగు
- ఇప్పటివరకు 10 వేల కవర్లు అందించిన ఉద్యానశాఖ


మెరకముడిదాం మండలంలో మామిడి కాయలకు తొడిగిన కవర్లు

కవరులో మామిడి.. నాణ్యమైన దిగుబడి

విజయనగరం ఫోర్ట్: మామిడి పండు అంటే ఇష్టపడని వారు ఉండరు. పిల్లలు దగ్గర నుంచి పెద్ద వారు వరకు అందరూ మామిడి పండును ఎంతో ఇష్టంగా తింటారు. అయితే మామిడి పిందె దశలో ఉన్నప్పటి నుంచి జాగ్రత్తలు పాటించకపోతే దిగుబడి తగ్గడంతో పాటు పంట నాణ్యత కూడ దెబ్బతింటుంది. దీని వల్ల మామిడి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన పంట రావడంతో పాటు ధర కూడా ఎక్కువగా రావడం కోసం మామిడి రైతులు వినూత్నమైన ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు. మామిడిలో ఫ్రూటీ కవర్లు అనే కొత్త విధానాన్ని అవలంభిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు ప్రాంతాల్లో ఫ్రూటీ కవర్ల విధానాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు.

పురుగు మందులు పిచికారి చేసినా..!

మామిడిలో పూత, పిందె నిలబడడంతో పాటు పురుగుల నివారణ కోసం మామిడి రైతులు రెండు, మూడు దఫాలు పురుగు మందులు పిచికారీ చేస్తూంటారు. దీని వల్ల రైతులకు అంతగా ప్రయోజనం ఉండదు. ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా మామిడికి మచ్చలు, పురుగులు ఆశిస్తూ ఉంటాయి. ముఖ్యంగా పండు ఈగ మామిడిని ఆశించి దెబ్బతీస్తుంది. ఈ సమయంలో నాణ్యమైన కాయల దిగుబడికి రైతులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఫ్రూటీ కవర్లు తొడిగి అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.


కవరు తొడిగిన తర్వాత వచ్చిన నాణ్యమైన మామిడి పండు

కవర్‌కు రుపాయి రాయితీ..

మామిడి కాయలకు తొడిగే కవర్‌కు ఉద్యానవన శాఖ 50 శాతం రాయితీ ఇస్తుంది. ఒక కవర్ రూ. 2 అయితే రైతు తన వాటా కింద రుపాయి భరించాలి. ప్రస్తుతం జిల్లాలో 30 వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉంది. ఇప్పటివరకు ఉద్యానశాఖ సుమారు 10 వేల కవర్లు అందించింది. ఇదిలా ఉంటే మామిడి కాయలకు కవర్లు తొడిగే సమయంలో రైతులు వాటిపై తేదీలు రాసుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. మామిడికాయలు అన్ని ఒకే సమయంలో కోతకు రావు. అందుకే కాయలకు కవర్లు తొడిగినప్పుడే తేదీలు రాసుకోవడం వల్ల ఎప్పుడు ఏ కాయలు కోయాలో సులువుగా తెలుసుకోవచ్చు. పేపర్‌తో చేసిన కవర్లనే వాడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ పాలిథిన్ కవర్లు వినియోగించకూడదు. పేపర్ కవర్లు వినియోగించడం వల్ల కాయకు గాలి, వెలుతురు తగలడం వల్ల నాణ్యంగా ఉంటుంది.

> **నాణ్యమైన దిగుబడి**
>
> మామిడి కాయలకు కవర్లు తొడగడం వల్ల నాణ్యమైన దిగుబడి వస్తుంది. కవరు ఖరీదు రూ.2 కాగా ఉద్యానవన శాఖ రూపాయి భరిస్తుంది. మిగిలిన రూపాయి రైతు భరించాలి. ఇప్పటివరకు పది వేల కవర్లు అందించాం.
>
> – జమదగ్ని, డిప్యూటీ డైరెక్టర్, ఉద్యానశాఖ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

కాయకు కవర్ తొడిగేటప్పుడు కవర్ అడుగుకు కాయ తగలకుండా కొంచెం ఖాళీ ఉండేలా చూసుకోవాలి. కాయ పెరుగుతున్నప్పుడు కవర్ పగిలిపోకుండా ఉంటుంది. వర్షం పడినప్పుడు, మంచు పడే సమయంలో కవర్లు తొడగకూడదు. ఎండ ఉన్న రోజు మాత్రమే కవర్లు వేయాలి.

మరో సైబర్ మోసం..

- ఏఎస్సైనంటూ పరిచయం చేసుకుని డబ్బులు వసూలు చేసిన వైనం
- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు


సైబర్ నేరంపై ఫిర్యాదు చేస్తున్న పొట్నూరు శ్రీనివాసరావు

సంతకవిటి: మండలంలో మరో సైబర్ మోసం చోటుచేసుకుంది. ఏఎస్సైనంటూ ఓ వ్యక్తి కొంతమందిని పరిచయం చేసుకుని డబ్బులు వసూలు చేసి మోసగించాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆర్. గోపాలరావు తెలియజేసిన వివరాల మేరకు.. వినాయక మోడరన్ రైస్ మిల్, వినాయక ట్రేడర్స్ యజమాని పొట్నూరు శ్రీనివాసరావుకు శనివారం సాయంత్రం అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తాను మండల పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఏఎస్సైనని.. ఎస్సై కుమారుడికి బాగోలేకపోవడంతో శ్రీకాకుళం ఆస్పత్రిలో చేర్పించామని చెప్పాడు. అర్జంటుగా ఎస్సైకి డబ్బులు పంపించాలి.. నా దగ్గర క్యాష్ ఉంది, మీరు నాకు ఫోన్‌పే చేస్తే నేను ఆయనకు డబ్బులు పంపిస్తాను.. మీరు స్టేషన్‌కు వచ్చి డబ్బులు తీసుకోండని అపరిచిత వ్యక్తి చెప్పారు. అయితే శ్రీను తన దగ్గర డబ్బుల్లేవని బదులివ్వడంతో.. నేను కొత్తగా వచ్చాను, నాకు ఎవ్వరూ పరిచయస్తులు లేరు.. తెలిసిన వారుంటే చెప్పమని అపరిచిత వ్యక్తి కోరాడు. దీంతో శ్రీను స్పందిస్తూ సంతకవిటికి చెందిన బొద్దాన సుధాకర్, గరికిపాడు గ్రామానికి చెందిన కోరాడ సంతోష్‌కుమార్, వాసుదేవపట్నం గ్రామానికి చెందిన మొదలవలస అప్పలసూరిలతో మాట్లాడి వాళ్ల ఫోన్ నంబర్లు ఇచ్చాడు. వారికి అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి రూ. 12 వేలు, రూ. 15 వేలు, రూ. 70 వేలు ఫోన్ పే చేయించుకున్నాడు. మరుచటి రోజు వారంతా డబ్బులు తీసుకునేందుకు స్టేషన్‌కు వెళ్లగా.. కొత్త ఏఎస్సైగా ఎవ్వరూ రాలేదని సిబ్బంది బదులిచ్చారు. వెంటనే అపరిచిత వ్యక్తి నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై గోపాలరావు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లేట్ కాంపోనెంట్ ప్రారంభం


ప్లేట్ లెట్స్ కాంపోనెంట్ యూనిట్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో సీఎస్ఆర్ నిధులు రూ.76.01 లక్షలతో ఏర్పాటు చేసిన ప్లేట్ లెట్స్ యూనిట్‌తో పాటు, ఎస్‌డీపీ యూనిట్‌ను రాష్ట్ర ఎంఎస్ఎంఈ సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ విశేషమైన సేవలను అందిస్తోందన్నారు. కాంపోనెంట్ యూనిట్ ద్వారా ఉమ్మడి జిల్లాల్లో అవసరమైన వారికి రక్తంతో పాటు రెడ్ బ్లడ్ సెల్స్, ఫ్రెష్ ఫ్రోజెన్ ఫ్లాస్మా, ప్లేట్ లెట్స్, క్రయాప్రెసిపిరేట్, సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్‌ను సరఫరా చేస్తుందన్నారు. ఆరోగ్య వంతులంతా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, రెడ్‌క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు, కార్యదర్శి సత్యం, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం.జయచంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు ఛేదన

- పోలీసుల అదుపులో నిందితుడు
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ అంకితా సురానా


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అంకితా సురాన

సాలూరు రూరల్: మండలంలోని చీపురువలస సమీపంలో గల జీడితోటలో యువతి మృతదేహాన్ని మార్చి 28న గుర్తించిన సంగతి తెలిసిందే. యువతి అనుమానాస్పదంగా మృతి చెందిందని భావించిన పోలీసులు విచారణ చేపట్టిన 48 గంటల్లో ఛేదించి హత్యగా నిర్ధారించారు. ఈ మేరకు సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ అంకితా సురాన కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించింది... మండలంలోని దత్తివలస గ్రామానికి చెందిన పెరుమాళ్ల రాంబాబు (శ్రీరామ్) ఆరు నెలల కిందట పసుపువానివలస గ్రామంలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొనగా.. ఐశ్వర్య అనే అమ్మాయితో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ఇలా కొనసాగుతుండగా ఈ సంవత్సరం జనవరిలో విశాఖపట్నం పైనాపిల్ కాలనీలో తామిద్దరం భార్యాభర్తలమని చెప్పి ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అయితే రాంబాబుకు అప్పటికే వివాహం అయిన సంగతి ఐశ్వర్యకు చెప్పలేదు. ఇటీవల కాలంలో తనను పెళ్లి చేసుకోవాలని ఐశ్వర్య పట్టుబట్టడంతో మార్చి 27న పెళ్లి చేసుకుంటానని రాంబాబు హామీ ఇచ్చాడు. అయితే ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలనే ఉద్దేశంతో ఆ మరుచటి రోజు అద్దెకు ఉంటున్న ఇంటిలో ఐశ్వర్యను ఉరి చేసి, తర్వాత లైఫ్‌కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించడంతో స్నేహితుడి సహకారంతో బైక్‌పై మృతదేహాన్ని పెట్టి సాలూరు మండలం చీపురువలస వద్దకు తీసుకువచ్చి జీడితోటలో పడేశాడు. పోలీసులు మొదట్లో అనుమానాస్పద మృతి కేసుగా భావించినప్పటికీ, విచారణలో రాంబాబే హత్య చేసినట్లు తేలింది. ద్విచక్ర వాహనంపై మృతదేహాన్ని తీసుకురావడానికి సహకరించిన స్నేహితుడ్ని ఏ2గా... అదే వాహనానికి పెట్రోల్ పోసేందుకు సహకరించిన వ్యక్తిని ఏ3గా కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి రెండు ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ రామకృష్ణ, పట్టణ సీఐ అప్పలనాయుడు పాచిపెంట, మక్కువ సాలూరు ఎస్సైలు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్స్‌తో రిజిస్ట్రేషన్లు


సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ నాగలక్ష్మి

విజయనగరం రూరల్:

రిజిస్ట్రేషన్లను మరింత సులభతరం చేయడానికి ప్రభుత్వం తీసుకు వచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని ఈ నెల రెండో తేదీ నుంచి విజయనగరం ఆర్వో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభించనున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ ఎ.నాగలక్ష్మి తెలిపారు. పట్టణంలోని దాసన్నపేటలో ఉన్న ఆర్వో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ ఏవీ కుమారితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూ క్రయ, విక్రయదారులకు సమయం వృథా కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం తీసుకు వచ్చిందని చెప్పారు. ఈ విధానం వల్ల పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. పబ్లిక్ డేటా ఎంట్రీ విధానం ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్లు ఎస్వీ ప్రసాద్, కేవీ షీలా, సిబ్బంది, క్రయ విక్రయదారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సీమంతం


కానిస్టేబుల్ ప్రమీలకు సీమంతం చేస్తున్న ఏఎస్పీ అంకిత సురానా

సాలూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బి. ప్రమీలకు ఏఎస్పీ అంకిత సురానా, సహచర సిబ్బంది సోమవారం స్థానిక స్టేషన్ ఆవరణలో సీమంతం చేపట్టారు. పీఎస్‌ను తనిఖీ చేయడానికి వచ్చిన ఏఎస్పీ అంకిత సురానాకు మహిళా కానిస్టేబుల్ గర్భంతో ఉన్న విషయం తెలిసింది. వెంటనే సహచర సిబ్బంది సహకారంతో సీమంతం నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం నిర్వహించడంపై ఏఎస్పీని పలువురు అభినందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹260

అంతర్జాతీయ పోటీలకు కోమటిపల్లి యువకుడు


దీసరి భానుప్రసాద్

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన దీసరి భానుప్రసాద్ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్) ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విశాఖలో జరిగిన పోటీల్లో పాల్గొన్న భానుప్రసాద్ మొదటి స్థానం సాధించాడని పేర్కొన్నారు. ఏప్రిల్ 3 నుంచి 7 వరకు నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భానుప్రసాద్ తలపడనున్నాడన్నారు. ఇదిలా ఉంటే ప్రయాణ ఖర్చుల కోసం జనసేన జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడి దుర్గాప్రసాద్ ఐదు వేల రూపాయలను భానుప్రసాద్‌కు అందజేశారు.

న్యాయం చేయాలి..


వల్లంపూడి స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న బాధితులు, శింగవరం గ్రామస్తులు

- వల్లంపూడి స్టేషన్ వద్ద బైఠాయించిన బాధితులు
- సీఐ చొరవతో ఆందోళన విరమణ


ఫిర్యాదుదారులు, పెద్దలతో మాట్లాడుతున్న రూరర్ సీఐ అప్పలనాయుడు

వేపాడ: ఓ భూ వివాదంపై వల్లంపూడి ఎస్సై బి. దేవి తమకు న్యాయం చేయడం లేదని.. ఫిర్యాదు కూడా నమోదు చేయడం లేదని ఆరోపిస్తూ శింగవరం గ్రామానికి చెందిన మైచర్ల జయమ్మ, అప్పన్నదొర, భారతి, తదితరులు సోమవారం స్థానిక వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన నిర్వహించారు. బాధితులకు అండగా గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకుని బైఠాయించారు. మార్చి 26న తమపై ప్రత్యర్థులు దాడి చేసి గాయపరిచారని, ఫిర్యాదు చేయడానికి వస్తే కనీసం ఫిర్యాదు కూడా తీసుకోలేదని బాధితులు జయమ్మ, అప్పన్నదొర, భారతి వాపోయారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎల్.కోట ఎస్సై సీహెచ్ నవీన్ పడాల్ వల్లంపూడి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఇదే సమయంలో ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు కూడా చేరుకుని ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలే తప్ప ఇలా చేయకూడదని సూచించారు. పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

రెల్లి కులస్తుల ఆందోళన

- రిజర్వేషన్ శాతాన్ని పెంచాలంటూ డిమాండ్



ప్లకార్డు ప్రదర్శిస్తున్న చిన్నారులు


బాలాజీ కూడలిలో రెల్లికులస్తుల మహాధర్నా

విజయనగరం టౌన్: జిల్లాను యూనిట్‌గా చేసి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, రెల్లి కులస్తులకు వర్గీకరణలో రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని, వర్గీకరణ అనేది కులగణన చేపట్టిన తర్వాతనే చేయాలని విజయనగరం రెల్లి సామాజిక వర్గం ప్రతినిధులు బంగారు దుర్గారావు, యర్రంశెట్టి వాలి, శ్రీను తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విజయనగరం బాలాజీ జంక్షన్ వద్ద ఆందోళన చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగి రెల్లికులస్తులకు అన్యాయం చేయవద్దన్నారు. భావితరాలకు ఈ ఫలాలు అందాలంటే వర్గీకరణ విషయంలో తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సామాజిక వర్గ ప్రతినిధులు రామారావు, సతీష్, రమణ, రఘు, సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

గంట్యాడ: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కొర్లాం గ్రామానికి చెందిన ఇందుకూరి స్నేహితగుప్తాకు (9) ఆదివారం సాయంత్రం జ్వరం రావడంతో వారి తాత, అమ్మమ్మలు లక్కిడాం జంక్షన్‌లో ఉన్న ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తీసుకెళ్లారు. సోమవారం సాయంత్రం మరలా గుప్తాకు వాంతులు కావడంతో విజయనగరంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. సర్వజన ఆస్పత్రి వైద్యులు బాలుడ్ని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అయితే మృతిపై అనుమానాలున్నాయని కుటుంబ సభ్యులు ఆరోపించడంతో మృతదేహానికి పోస్టుమార్టం చేయాలని నిర్ణయించి, మార్చురీ గదికి తరలించారు. స్నేహిత గుప్తా తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. చిన్నారి తాతగారింట్లో ఉంటూ ఓ ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుకుంటున్నాడు.

లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం సమీపంలో (సాలూరు – విశాఖపట్నం రోడ్డు) ఐరన్ రేకులతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ సీఐ సూరినాయుడు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయ్‌పూర్ నుంచి విశాఖకు ఇనుప రేకులతో వెళ్తున్న లారీ ఎస్పీ కార్యాలయం సమీపంలో వాటర్ ట్యాంక్ వద్ద మలుపు తిప్పే క్రమంలో ఒక్కసారిగా తిరగబడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు చిన్న చిన్న గాయాలయ్యాయి. అటు ఎస్పీ ఆఫీస్, ఇటు డీఎస్పీ ఆఫీసుకు ఆమడ దూరంలో లారీ బోల్తా పడింది. సెలవు రోజు కావడంతో జనసంచారం పెద్దగా లేదు. లేదంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని లారీని తొలగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ ఉగాది ఆఫర్ 31 మార్చ్ లోగా ఫ్లాట్ కొనండి మరియు పొందండి 1.5 టన్ AC, Car Parking, GST, Generator, Power ఉచితంగా. ఇప్పుడు చ॥అ॥ 3000 కాదు 2800 మాత్రమే. నాయుడు వీధి, కొత్తవలస, పార్వతీపురం. 9490945839 [SCA25002471]

HOUSE FOR SALE

■ విజయనగరం లోకల్ కార్పొరేషన్ పరిధిలో 167 చ॥గ॥ వుడా అప్రూవ్డ్ స్థలంలో 2BHK ఇల్లు కేవలం 38 లక్షలు మాత్రమే అతి తక్కువ వడ్డీ రేటుతో 90% బ్యాంకు లోన్ సదుపాయం కలదు. 9391873337, 8143333494 [SCA25002463]

WANTED

■ ఉద్యోగ అవకాశం విజయనగరం లోకల్ గోల్డెన్ వెంచర్స్ వారి హౌసింగ్ ప్రాజెక్టు మార్కెటింగ్ చేయుటకు యువతీ, యువకులు టెలీకాలర్స్ 5, మార్కెటింగ్ మిత్రులు 10, అకౌంటెంట్ 1, టీం ఉన్న లీడర్‌కు మంచి ప్రాధాన్యం కలదు. మంచి జీతం, కమీషన్. ట్రైనింగ్ ఇవ్వబడును. 8688796746 [SCA 25002464]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18k. ఫోన్: 9640400073, 9160900024 [SCA25002453]

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002418]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీరూం+భోజనం. HYD. 8317512135 [HA-245]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.